

# జయభేరి

-విహెచ్చార్. సుంకర

**'మద్రాస్ ఎక్స్‌ప్రెస్' ఏదో చిన్న బ్రిడ్జిని దాటుతున్నట్లుంది - 'ధన్... ధన్'మనే శబ్దం ఆ సెకండ్ ఏసీ కంపార్ట్‌మెంట్‌లో ప్రతిధ్వనిస్తోంది.**

అప్పర్‌బెర్త్ మీదున్న 'జయ' నిద్రపోవాలని ప్రయత్నించి, విఫలురాలై 'బెడ్‌లైట్' విరజిమ్ముతున్న నీలికాంతుల్ని చూస్తూ అసహనంగా అటూ - ఇటూ కదిలింది.

ట్రైన్ శబ్దంతోబాటు - ఎదుటి బెర్త్ 'మామీ' పెడుతున్న గురక శబ్దం కూడా లయబద్ధంగా వినిపిస్తుంటే -

ట్రైన్ బయలుదేరినప్పటి నుండీ - 'మామీ' చెప్పిన విషయాలన్నీ గుర్తుకొచ్చి -

'ఎవరి జీవితం కూడా పూలపాన్పు కాదు -' అనుకుంటూ చిన్నగా నిట్టూర్చింది.

చేతిలో వున్న 'ఎరిక్‌సెగల్' నవలలో వుంచిన 'ఆ వుత్తరాన్ని' మరోమారు చదవాలనే కోరికను అణుచుకోలేకపోయింది.

'రీడింగ్ లైట్'ను ఆన్ చేసి, ఆ నాలుగు మడతల కాగితంలో దాగిన - తన ఫ్రెండ్ భవానీ జీవితాన్ని చూడాలనుకుంది!

'భవానీ' గుర్తుకు రాగానే 'జయ' మనసు నెవరో పిండినట్లనిపించింది!

భవానీ ...

చైతన్యానికి ప్రతీకలా, సాహిత్యానికి నిర్వచనంలా వుండేది!

స్పెషల్‌తెలుగులో బి. ఏ చేస్తున్న 'భవానీ' పాల్గొనకుండా ఎటువంటి కార్యక్రమం కూడా జరిగేది కాదు.

'ఆటలు- పాటలు' మొదలు అన్ని కార్యక్రమాల్లోనూ అల్లుకుపోయే 'భవానీయే - నాడు అందరికీ ఆదర్శమూర్తి.'

అలాంటి తనకి బి. ఏ రిజల్ట్స్ రాకముందే పెళ్ళైపోయింది.

ఎడతెగని జలపాతంలా - తుళ్ళుతూ గంతులేసిన భవానీ పెళ్ళి పీటల మీద ముచ్చటగా .. బుద్ధిగా తలవంచుకుని కూర్చొని -

ఫ్రెండ్స్ అందరినీ ఆశ్చర్యంలో ముంచేసింది!

అదే ... ఆఖరిసారిగా ... దాన్ని చూడ్డం!

ఆ తర్వాత దాదాపు నాలుగు సంవత్సరాలు .. ఎలా గడిచిపోయాయో? ఆలోచనతో బరువెక్కిపోయింది మనసు.

కళ్ళు రెండూ ... అశ్రువులతో పొంగిపోయి -

కళ్ళ ముందు కదిలిన దృశ్యాలను అస్పష్టం చేసేశాయి!

కళ్ళల్లో పొంగిన భాష్పాలు .. అక్కడే నిలిచిపోయి ... ఆమెను కష్టపెట్టలేక ... చెంపల మీదుగా జారి ఎయిర్ పిల్లో మీద విశాలంగా పరచుకున్న కురుల్లోకి మౌనంగా నిష్క్రమించాయి.

కళ్ళు తుడుచుకుని లెటర్ విప్పింది ...

''జయే! చారు శీలే!''

అదే పిలుపు. ఎదురుగా పలకరిస్తున్నట్టు.

టీవీ రామాయణం రోజుల్లో తన ఫ్రెండ్స్‌నందరినీ 'సీతే' అన్న స్టైల్లో పిలుస్తూ అల్లరి చేస్తుండేది ... తనను మాత్రం 'జయే' అని పిలిచి, నిన్ను 'ప్రియే! చారుశీలే' అని పిలవాలనిపిస్తోందే!

అలా పిలవ్వచ్చునుకో .. అయితే ఎవరైనా అపార్థమనే పదార్థాన్ని - ఉప్పు పెట్టి, ఉడికించి - ఊరంతా ఏం చేస్తారేమోనని ఇలా 'జయే' అని పిలిచి తృప్తి పడుతుంటాను - అంటూ తన అందాన్ని ఏదో ఒక వంకన పొగిడి పొంగిపోతుండే భవాని ... ఇప్పుడు కళ్ళముందే కదులుతోంది.. కదులుతున్న కన్నీటి పొరలనుండి అక్షరాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఎలా వున్నావే? పోతే నేనా ... ఇదిగో ఇలా ... ఊహల స్వర్గానికీ ... సమస్యల నరకానికీ మధ్య ఆశలనే ఆలంబనగా చేసుకుని ... వ్యక్తిత్వాన్ని చంపుకుని, అవ్యక్తమైన బాధతో అలమటిస్తున్నానని చెప్పలేనుగానీ, దాదాపు అదే స్థితిలో వున్నానే!

ఆడపిల్ల జీవితంలో అందమైన అధ్యాయం వధువుగా మారకముందేనని ఎవరైనా అంటే మండిపడేదాన్ని గుర్తుందా? అదెంత తప్పో ఇప్పుడు తెలిసొచ్చింది.

''మా వారు నీకు ఇంకా గుర్తున్నారా? గుర్తుండే వుంటాడు. అరుదైన వ్యక్తని ఆనాడే బిరుది''చ్చావు. గుర్తుందా?

నిజంగా అరుదైన వ్యక్తే సుమా! కనీసం చెప్పుకుందామన్నా - ఎలాంటి చెడు అలవాటూ లేదు.

పోనీ కట్నకానుకల కోసం ఆశించే అల్పత్వం కూడా లేదు.

పరాయింట్లోపమేలా వున్నా కన్నెత్తి చూడరు.

టీవీ మేనక ఆరేసు కోబోయి పారేసుకుని - లంగా డ్యాన్సులు చేసినా చలించరంటే నమ్ముతావా!

అయితే ఇంకేం తెగులే? అంటావ్ ... నాకు తెలుసు! అంత సీరియస్ లెటర్లో కూడా హాస్యాన్ని చిలికింది అనుకుంది.

అయితే భవానిలోని భావుకత్వం ఇంకా చచ్చిపోలేదనుకుని కాస్త తృప్తిపడి, తిరిగి లెటర్లో మునిగిపోయింది జయ.

అయితే ప్రియే! తమరక్కడే, మన అన్నగారు ప్రజల నాడి మాకు తెలుసు అనుకొని బొక్కబోర్లా పడ్డట్టు పడ్డారన్న మాట!

మా ప్రవరాఖ్యుల వారు వరూధినికి మాత్రమేగాక నాకు, అంటే స్వంత భార్యక్కూడా - అంటే అర్థమైందా?

అలా అని ఆ విషయంలో అనుమానించేవ్? సంపూర్ణ పురుష పుంగవుడే సుమా!

భవానీ ధోరణికి చిన్నగా నవ్వుకుంది.



అర్ధరాత్రి దాటిపోయినట్లుంది .. కొంచెం నిద్ర వస్తున్నట్లనిపించింది.

రేపు ఎలాగూ ... పాయింట్ బై పాయింట్ టాకిల్ చేయాలి కదా! అనుకుంటుంటే ... శ్రీవారు శ్రీ సూర్య మాటలు గుర్తుకొచ్చాయి.


చూడండి జయమ్మాజీ! నువ్వు ఫ్రండ్ సమస్యల్ని సాల్వ్ చేయాలనుకుంటున్నావు. వెరీగుడ్.

అయితే అతను మరీ ఛాందసుడిలా అన్పిస్తున్నాడు.

నువ్వేమో ... అపర సత్యభామలా,

'నేయి వోయభగ్గున హుతాశన కీలలా' మండిపడి పోతున్నావు. సమస్య చాలా సున్నితమైంది. చాలా ఓపికగా టాకిల్ చేయాలి. అయినా నీ ఇష్టం మరి. బీకేర్‌ఫుల్.

నువ్వెంత మంచి వాడివి సూర్యా మనసారా అనుకుంది. అలా అనుకుంటూనే నిద్రలోకి జారిపోయింది.





పోర్టర్ల అరుపులతో బాటు మామీ కేకలతో జయకు మెలకువ వచ్చేసింది...

'అమ్మణీ! జియంబా .. మద్రాసు వందాచ్చి...'

మామీ తెగ హడావుడి పడిపోతోంది.

మిగతా ఇద్దరూ సామాన్లు సర్దేసుకుని రెడీగా వున్నారు.

నిద్రమత్తు వదిలించుకుని ... చెంగున క్రిందకు దిగిపోయి తన సామాను బుట్టలో సర్దేసుకుని, సూట్‌కేస్ క్రిందకు దించుకుని రాబోయే ... మిస్టర్ భవానీ శంకరం కోసం కిటికీలోంచి చూడ సాగింది.

తమ ప్లాన్ ప్రకారం ... భవానీ నిన్ననే పుట్టింటికి టపా కట్టేసి వుంటుంది అనుకుంటుండగానే అతను వచ్చేశాడు.

## 'ఏర్' ఇండియా ఘాయ్

'సుభాష్‌ఘాయ్' పేరు వినని సినీ జనాలుండరు. ఆయన ఏర్ ఇండియా బోర్డులో 15 సభ్యుల్లో ఒకరుగా నియమింప బడ్డారు. అది విశేషమో కాదో తెలీదు కానీ యాదేన్‌లో 'కరీనా'కి తల్లిగా 'రతి అగ్ని హోత్రి'ని ఒప్పించాడంటం మహా విశేషం అంటున్నారు బాలీవుడ్ జనాలు. (మరి ఒక తారని మరో తారకి 'తల్లి'గా నటింపజేయడమంటే మాటలా ఏంటి?)



తన కంపార్ట్‌మెంట్ నెంబర్ అతనికిచ్చి మరీ వెళ్తుందని తెలుసు ...

హలో మీరేగా జయ గారంటే? అది ఫొటో చూపించింది... నా పేరు శంకరం .. అది అర్జంటుగా టెలిగ్రాం వచ్చిందని ఊరెళ్ళిపోయింది ... అని మాట్లాడుకుంటూనే ఎదురుగా కన్పించిన సూట్‌కేస్ పట్టుకుని హడావుడిగా ప్లాట్‌ఫారం మీదికెళ్ళిపోయాడు ...

''అయ్యో అమ్మణీ ... అవరు యారుంగే ... ఆ సూట్‌కేస నాది దా.. నా దిదా ...'' అంటూ శంకరం వెంటపడింది మామి.

వచ్చే నవ్వు నాపుకుంటూ తన సూట్‌కేస్‌తో క్రిందికి దిగింది జయ. అప్పటికే మామీ అరవంలో పెద్ద రవంతో ధారాళంగా ఉపన్యాసమిచ్చేస్తోంది.

నేను సూట్‌కేసులు ఎత్తుకుపోయే బాపతు కాదని అతి వినయంగా మనవి చేసుకుంటున్నాడు శంకరం ... సగం బిక్కచచ్చిపోయి. స్టేషన్ దాటి ఆటోలో ఇంటికొచ్చేసరికి గంట టైం పట్టింది. ఊరుకు దూరంగా అప్పుడప్పుడే డెవలప్ అవుతున్న కాలనీలా అన్పించింది.

ఇల్లు ఓ మాదిరిగా వుంది.

ఇంటి ముందున్న చిన్న పూలతోట భవానీ అభిరుచిని గుర్తుకు తెచ్చింది ...

తాళం తీసి ... 'స్నానం చేసి వస్తాను' అంటూ ఇంటి వెనక్కి వెళ్ళిపోయాడు శంకరం.

'మైలపడి పోయినందువలన' స్నానం చేయబోతున్నాడని గ్రహించి చిన్నగా నవ్వుకుని ఇంట్లోకి వెళ్ళి అలసటగా కుర్చీలో కూర్చుండిపోయి ఇంటిని పరిశీలించసాగింది .. నాలుగు గదుల ఇల్లది.

డ్రాయింగ్ రూం గోడలనిండా ఆడామగా తేడా లేకుండా క్రిక్కిరిసిపోయి వున్నారు దేవుళ్ళంతా.

ఇల్లంతా అగరుబత్తుల వాసనతో అదో మాదిరిగా అన్పించింది. అంతలోనే అతను వచ్చేశాడు మడిపంచతో.

చాలా ఇబ్బందిగా కదిలింది జయ ... అతనా విషయం గమనించలేదని అర్థం చేసుకుంది.

ఇదిగోండి ... ఈ పూజ అయిపోగానే ... అలా వెళ్ళి ... మా ఫ్రండ్ పెళ్ళాన్నడిగి ... మీకు కాఫీ తెస్తాను. ఇక్కడెక్కడా హోటల్ లేదు' తన పని తాను చేసుకుంటూనే మాట్లాడుతున్నాడు.

ఫ్రెండ్ భార్య అనలేవా? మూర్ఖుడా? అని అడుగుదామనుకుని, నోరు విప్పబోయి ఆగిపోయింది. చిన్న విషయాన్ని పట్టించుకుంటే, ఆ తర్వాత కష్టమవుతుందని ఊరుకుంది ...

తొమ్మిదింటికల్లా తయారైపోయి .. ఎన్నో జాగ్రత్తలు చెప్పి బ్యాంక్‌కెళ్ళిపోయాడు భవానీ భర్త. అతను వెళ్ళిన దారినే చూస్తూ ... 'సాయంత్రం చూస్తాలే తమరి సంగతి' అనుకుంటూ ఆలోచనల్లోకి జారిపోయింది.

''ఏయ్! ప్రియే! ఆ మనిషిని మరీ బెంబేలెత్తేట్లు చేయకే బాబూ! అసలే తిక్క మనిషి! హఠాత్తుగా సన్యాసం పుచ్చుకుని ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టరయి పోగలడు! ఆ తర్వాత ఎవరి మాటా వినపడదు మరి.''

జయ రాసిన మాటలు గుర్తొచ్చాయి.

ఆ తర్వాత నెమ్మదిగా వంట చేసుకుని, జాడీలో వున్న ఆవకాయతో లాగించేసి 'ఎరిక్ సెగల్' డాక్టర్స్‌ని పరామర్శిస్తూ పగలంతా గడిపేసింది.

సాయంత్రం అయిదవుతుండగా లేచి, కష్టపడి ఏరుకుని తెచ్చుకున్న బీద రకం చీర కట్టుకుని, పైట కొంగును నీళ్ళతో తడుపుకుని మంచం మధ్యకు చేరి ముసుగు పెట్టేసింది.

దాదాపు ఆరు గంటలకు ఆదరాబాదరాగా వచ్చేశాడు శంకరం.

అతని చెప్పుల శబ్దం వింటూనే ఎలర్టయిపోయి, ముసుగులో నుండే ... సన్నగా మూలగడం మొదలుపెట్టింది.

ఆ శబ్దం వింటూనే గాబరాపడిపోయి,

'జయ గారూ! చెల్లాయి గారూ' అంటూ నానా హైరానా పడి పోయాడు అతను.

''అయ్యో! మీరలా బాధపడితే ఎలా? అసలింతకూ ఎందుకు ఏడుస్తున్నారు? సమయానికి అది కూడా లేదు'' తర్వాతేం మాట్లా డాలో అర్థంగాక ఆపేశాడు.

దుఃఖం కట్టలు త్రెంచుకుంది అన్న స్టైల్లో రాగాలు తీసి, లేని పోని వెక్కిళ్ళు అభినయించి, కొంగుడు నీళ్ళు కళ్ళల్లో పిండుకుని - అరగంట తర్వాత అతి విచారమైన తన ముఖాన్ని బయటపెట్టింది.

తడిసిపోయివున్న కొంగునూ, ఎర్రపడిన కళ్ళనూ చూసి గతుక్కుమన్నాడు శంకరం.

అసలు సంగతేమిటో అర్థం కావడం లేదు నాకు ... దయచేసి కొంచెం కంట్రోల్ చేసుకోండి అన్నాడు గొంతు పెగుల్చుకుని.

అన్నయ్య గారూ! హంతా నా ఖర్మ... మీరేమీ వర్రీ కాకండి అంటూనే ఆమె శోకదేవత అయ్యింది అన్న విధంగా బావురుమని, ముఖాన్ని చేతుల్లో దాచుకుంది.

శంకరానికేమి చెయ్యాలో అర్థం కాలేదు.

'పోనీ ... నేనెళ్ళి దాన్ని తీసుకొచ్చేయనా?' అన్నాడు.

తెగే దాకా లాగకూడదనుకుని, చిన్నగా నిట్టూర్చి 'ఎవరితో చెప్పుకున్నా నా ఖర్మమింతేనన్నయ్యా ... నా బతుకింతే. మీరు నా కోసం చూడకుండా ... మీ పనులవీ చూసుకోండి' అంటూనే మరోసారి బావురుమంది.

'ఇప్పుడవన్నీ ఎందుగ్గానీ ... మీరిలా ఏడుస్తూ వుంటే' అతని మాట పూర్తి గాకుండానే -

'అయ్యయ్యో పాపిష్టిదాన్ని... మిమ్మల్ని అనవసరంగా బాధ పెట్టేశాను' అంటూనే మంచం దిగి ... భారంగా గోడకు ఆనుకుని నిలబడి శంకరం ముఖంలోకి దీనంగా చూసింది ... మానవుడు కాస్త యినా ద్రవించాడో లేదో తెలుసుకుందామని.

నుదుటిపైన అరంగుళం భాగం నున్నగా గీకేసిన గుండే తప్ప భావాలు కనిపించలేదామెకు.

ఆ బుర్ర విషయంలో తప్ప, మిగతా డ్రెస్సింగ్‌లో ఆధునికంగానే వున్నా, చూట్టానికెందుకో వికారంగా కన్పించాడు.

అలాగే మంచంకోడు ప్రక్కగా సెటిలైపోతూ -

'నా కథ చెప్పి మిమ్మల్ని ...' చిన్నగా బెక్కింది...

'అయ్యయ్యో! అదేం కాదు...' తడబడుతూ అన్నాడు.

'మీరు మా వారిని చూడలేదు కదన్నయ్యా! ఆయనో బుద్ధావ తారం.' ఏదో తెలుగు నవల ప్రారంభ వాక్యాల్ని గుర్తు చేసుకుంటూ చాలా భారంగా మొదలుపెట్టింది...

'మా వారికి పంచాంగాల పిచ్చి పట్టిందన్నయ్యా. ఎప్పుడూ తిథులూ, నక్షత్రాలూ అంటూ పనికిరాని కబుర్లు చెప్తారే తప్ప - మరెలాంటి సరదాలూ లేవు. మల్లెపూవుకీ ఉల్లిపూవుకీ తేడా కూడా తెలీదంటే మీరు నమ్ముతారా?'

గతుక్కుమంటాడేమోనని ఎదురుచూసి, నిరాశతో మళ్ళీ కథ లోకొచ్చేసింది.

కొన్ని రోజులు అయ్యప్ప ఉపవాసాలు, కొన్ని రోజులు తిరపతి ఉపవాసాలు, ఆ తర్వాత మంగళ వారాలూ, అమావాస్యలూ - ఒక టేమిటి నా శ్రాద్ధం .. మన దేశంలో తగలడిన ఖర్మలన్నీ ఈయన్నే దాపురించాయి. ఉపవాసాల మూలంగా యాసిడొచ్చి అల్సర్లు పెరి గాయన్నారు డాక్టర్లు. ఆ తర్వాత అల్సర్ ముదిరిపోయి క్యాన్సర్‌లోకి దించొచ్చని వార్నింగ్ కూడా ఇచ్చారన్నయ్యా అంటూ కొంగు అడ్డం పెట్టేసుకుంది ముఖానికి.



ఇప్పుడు వచ్చింది ఎఫెక్ట్. గతుక్కుమన్నాడు శంకరం.

పోనీ ఆరోగ్యం బాగులేదు కదా! ఎప్పుడు గుటుక్కుమంటారో నని ఓ పది లక్షలకి భీమా చెయ్యమని బ్రతిమాలినా వినడం లేదు.

మీరే చెప్పండి! ఆయనపోతే నేను నాలుగిళ్ళల్లో అంట్లు తోము కోవాలే తప్ప, వెధవ గ్రాడ్యుయేషన్‌కు ఉద్యోగాలెవరిస్తారు?

ఔనన్నట్లు తలమాత్రం ఊపాడు.

## జితేంద్రా జూనియర్

హిందీ కృష్ణగా పాపులర్ పొందిన జితేంద్ర తన పుత్రుడ్ని నటుడుగా ప్రవేశపెడ్తున్నాడు - 'ముజె కుచ్ కెహెనా హై' చిత్రం ద్వారా. జితేంద్ర కొడుకు 'తుషార్' మిచిగన్ యూనివర్శిటీలో చదువుకు న్నాడు. జితేంద్ర బబితతో తొలిసారి 'ఫర్జ్' ద్వారా రంగ ప్రవేశం చేశాడు. ఇప్పుడు తుషార్ బబిత కూతురు కరీనాతో రంగప్రవేశం చేస్తున్నాడు.



ఇకపోతే ఆయన దృష్టిలో స్త్రీ లింగానికీ, నపుంసక లింగానికీ తేడాలేదు.

వస్తువుల్ని పిలిచినట్లో, జంతువుల్ని పిలిచినట్లో - అది - ఇది - ఒసే - ఓయ్ అంటూ పిలుస్తారే తప్ప, మర్యాదగా పిలవడం వారికి రాదు. నేను కూడా ఓరే - అరే అని పిలవొచ్చు కదా! పైగా కట్నం ఇచ్చింది నేను కదా!

కొంచెంగా షాక్ తిన్నట్లనిపించిందతని ముఖాన్ని చూస్తే!

''మేము పేరుకు మాత్రమే భార్యాభర్తలం. కలిసివుంటున్నామే తప్ప కాపురం చెయ్యడం లేదు.''

కొంచెం వేటూరి పాటల్లో మాటల్లా ద్వంద్వార్థాలు వస్తున్నా యేమోనని ఆలోచించి -

నా తర్వాత పెళ్ళి చేసుకున్న ఫ్రెండ్సంతా తల్లులైపోయారు - నేను మాత్రం ఇలా మోడులా! పేడులా - మిగిలిపోయాను.

ఈ మాటే ఆయనతో అంటే -

ఓసి పిచ్చి మొఖమా! ఘడియ రావాలే! అంతా వాడిదయ అని ఊరుకోకుండా, వెయ్యి రూపాయలు ఖర్చుపెట్టి పుత్ర కామేష్టో? కామ పుత్రేష్టో - యాగం చేయించారు.

మీరు చెప్పండన్నయ్యా! ఈ కాలంలో మంత్రాలకు చింత కాయలు కూడా రాలడంలేదే? యాగాలకు పిల్లకాయలు పుడతారా?

యాగం చేస్తూ మంటల్లో నెయ్యేస్తుంటే చెయ్యి కాలడమే గాక బంగారంలాంటి పట్టుత్తరీయం నిప్పంటుకుని నిలువునా మసై పోయింది. యాగానికొచ్చిన జనాలు వెర్రికేకల్తో పరుగెడుతుంటే పందిరి కూలి ఫైరింజన్ని పిలవాల్సొచ్చింది. వచ్చే నవ్వును ఆపుకో

## ఐ యామ్ డిఫరెంట్!



అంటోంది ప్రియా గిల్, సిన్మాల్లో చేరక పోయుంటే నీ లైఫే వేరేగా ఉండేదేమో కదూ? అన్న దానికి సమాధానంగా. ఆర్మీ ఆఫీసరు కూతురిగా మా అన్నతో కల్సి స్కూళ్ళనే మార్చేవాళ్ళం. ఫ్రెండ్సూ మారే వారు. అంచేత నా (మా) లైఫ్ డిఫరెంట్ అన్నది. ఏమో అమ్మడూ! ప్రియుళ్ళనీ, ఆనక మొగుళ్ళనీ మాత్రం అలా మార్చొద్దు. సరేనా?

డానికి కూడా కష్టపడింది జయ.

శంకరం ముఖంలో కలవరం స్పష్టంగా కనిపిస్తోంది.

వచ్చే నెలలో తను కూడా అలాంటి యాగమే చేయాలను కున్నాడు. అయినా మనం వెర్రి బాగులోళ్ళలా రామాయణ కథల్నీ, భారత గాథల్నీ గుడ్డిగా నమ్ముతున్నాం గానీ ... అవన్నీ కట్టు కథలే నంటగా! పాండవులు కుంతీదేవికి వరం మూలంగా కాకుండా యమ ధర్మరాజు, ఇంద్రుడు వగైరాలవలన పుట్టారని మా తెలుగు లెక్చరర్ చెప్పినట్లు గుర్తు. పోనీ అలా చేసి కూడా పతివ్రతలమయిపోదా మంటే కాలం మారిపోయిందాయె?' మీరేమంటారు?

ఉబికి వస్తున్న సంతోషాన్ని అణుచుకుంటూ అడిగింది.

శంకరం ముఖం తెల్లగా పాలిపోయింది.

పిల్లల విషయం సరే. ప్రకృతి సిద్ధమైన భార్యాభర్తల కలయిక కూడా ఆయనకు ఏదో పాప కార్యంలా వుంటుంది. జంతువుల కున్న అవగాహన కూడా వారికి లేదన్నయ్యా.

కాలం ఇంత మారిపోయినా ... ఆయనింకా ఆటవిక దశలోనే వున్నారనిపిస్తోంది.

స్త్రీలకు మెన్సెస్ అనేది ఎంతో సహజమైన అతి చిన్న విషయం కదా! ఆయనకదేదో చావు సమస్య. ఆ వారం రోజులూ నా బ్రతుకు వీధి బ్రతుకే? నేను అప్పుడు ఇంట్లోకి వస్తే దేవుళ్ళంతా మైలపడి పోతారట. నేను బయటున్నప్పుడు ఇరుగు పొరుగు జనాలు గుచ్చి గుచ్చి చూస్తుంటే నాకు చచ్చిపోవాలనిపిస్తుంటుంది.

మాటలు ఆపి కావాలని కన్నీరు తెచ్చుకుంది.

భవానీ రాసిన విషయాలన్నిటినీ మర్చిపోకుండా చర్చించాలను కుంది. మంచినీళ్ళనే నెపంతో కిచెన్‌లోకి దూరిపోయి మరోసారి లెటరంతా చూసుకుని హాయిగా నిట్టూర్చింది.

అయ్యో శంకరం .. ఇక పీక్కుందువు గానిలే పిలక అను కుంటూ అతి మామూలుగా వచ్చి కూర్చుంది ... అప్పటికే శంకరం నేల చూపులు చూస్తున్నాడు.

అతని గుండెలు మంటల్లో మాడిపోతున్నాయి అనుకుంది.

మీరే ఆలోచించి చెప్పండన్నయ్యా న్యాయం! మీరు చామన ఛాయ కాబట్టి ఈ క్రాఫింగ్ మీకు సరిపోయింది. మా వారు ఎరుపూ, పైగా పళ్ళెత్తు. అందుకని ఆయనంతా మంకీ బ్రాండని ... నన్ను ...! చెప్పుకోవాలంటేనే సిగ్గుగా వుంది కళ్ళొత్తుకుంటూ ముగించింది.

శంకరం తలెత్తలేదు.

ఇక మా అత్త రాక్షసి గురించి. ఆమెకు మరేమీ పనిలేనట్లుంది. వారానికి రెండుత్తరాలు టంచన్‌గా రాసేస్తుంది. ఏమనో తెలుస న్నయ్యా? కోడలు నెల తప్పిందా? నీళ్ళోసుకుందా? అని. అంతే గానీ ఏరా అబ్బాయ్! నువ్వసలు మగాడివా? లేకపోతే శిఖండివా అని రాస్తే అప్పుడు తెలిసేది బాధంటే ఏమిటో. స్త్రీకి స్త్రీయే శత్రు వంటారే' ఇదేననుకుంటాను. అయ్యో చాలా ప్రొద్దుపోయింది .. అనవసరంగా మిమ్మల్ని విసిగించాను... సారీ అన్నయ్యా ... గుడ్ నైట్ చెప్పి మంచమెక్కేసింది జయ.

ఎవరికీ భోజనం చేయాలన్పించలేదు.

పది లంకణాలు చేసిన వాడిలా దిగాలుపడిపోయాడు శంకరం ... జయ చెప్పిన బాధలన్నీ తనకు పరిచయమైనవిగా కన్పించడంతో బాటు తన జీవితాన్నే ఎత్తిచూపినట్లు ఆలోచించుకుని ఆ రాత్రంతా కలత నిద్దర్లోనే గడిపేశాడు .. శంకరం ... భవానీ భర్త.

☆ ☆ ☆

అన్యమనస్కంగా లేచి - డ్రాయింగ్ రూంలోకి అడుగు పెట్టిన 'శంకరం' జయకు బదులు దర్శనమిచ్చిన లెటర్ని చూసి స్థాణువై పోయాడు!

అన్నయ్యగారూ!

''కుటుంబ గౌరవాన్ని కాపాడ్డంకోసం, అమ్మా నాన్నలను దూరం చేసుకోలేక - ఇన్నాళ్ళూ సహించాను. జీవచ్ఛవంలా గడి పాను! ఇక ఈ నరక యాతన్ని భరించలేను! నా సమస్యలకు పరి

ష్కారం నా చావే! భవానీతో చెప్పండి నా కోసం రెండు కన్నీటి చుక్కల్ని దానం చేయమని. నా బాధల గాథలతో మీ మనసును గాయపరిచాను. ఓ చెల్లెలి తప్పుగా భావించి క్షమించండి! ఒకే ఒక దిగులు మిగిలిపోయింది! అదే... భవానీని కలుసుకోలేకపోవడం - వచ్చే జన్మలో తప్పక కలుస్తానని చెప్పండి!

ఇట్లు:
అభాగ్యురాలు.. జయ.''

వెయ్యి వోల్టుల షాక్ తిన్న మనిషిలా కంపించిపోయి... కుప్పలా.. కూలిపోయాడు.. శంకరం.. మిష్టర్ ఆఫ్ భవానీ!

☆☆☆

రెండు వారాల తర్వాతొచ్చిన లెటర్ని వణికే చేతులతో విప్పింది జయ.

'హాయ్! ప్రియే!' ఆ పిలుపుతోనే మొత్తం అర్థమైపోయింది.

నిన్ను... లక్ష ముద్దుల నోముతో పూజించుకున్నా రుణం తీరదే!

ఏ మంత్రం వేశావో గానీ.. గురుడు డంగైపోయాడనుకో... నువ్వెళ్ళిపోయిన మర్నాడే ఇక్కడ ప్రత్యక్షయ్యాడు. కథంతా చెప్పి ... నీ లెటర్ చూపించి చాలా బాధపడిపోయాడనుకో.. నేనూ. బాగానే పోషించాననుకో - దుఃఖరసాన్ని ... నేనూ చచ్చిపోతానన్నాను!

ఆ తర్వాత చూడాలి.. మనిషి పూర్తిగా మారిపోయాడే!

పల్లెటూరి బావ సినిమాలో .. ఏయన్నార్‌లా ... ట్రిమ్‌గా క్రాఫ్ చేయించుకుని జిమ్‌గా తయారైపోయాడు. మా అత్తయ్యకిక కార్డుల ఖర్చు వుండదని నీ అందం మీద వట్టేస్తున్నాను! ... నువ్వు నిజంగా ప్రియవే సుమా...

అలా రాసింది మొత్తం ఉత్తరాన్ని - భవాని.

యురేకా అని గట్టిగా అరవాలనుకుని... నోరు తెరవబోయి ... నిశ్చేష్టురాలై నిలుచుండిపోయింది ... జయ.

అప్పటికే తన బాహువుల్లో చుట్టేసిన సూర్య ... కంగ్రాట్స్ అని ... చెవిలో ... గుసగుసలాడి... చంద్రబాబు నాయుడి జయభేరిని ... మించిపోయాహోయ్... అంటూ డే కాంప్లిమెంటిచ్చేసి... చుట్టుకు పోతుంటే - రాగరంజితాలైన బుగ్గల్లో సిగ్గులు సింగారాలొలికిస్తుంటే - తమకంగా ... సూర్య కౌగిలిలో కరిగిపోయింది...

మిసెస్ జయసూర్య.

# ఆంధ్రజ్యోతి వీక్లీ- తానా (టెక్సాస్)

## సంయుక్తంగా నిర్వహిస్తున్న జోకులు, కార్టూన్ల పోటీ:

### బహుమతుల వివరాలు:

**కార్టూన్లు:**

ప్రథమ బహుమతి: రూ. 4,000
రెండవ బహుమతి: రూ. 3,000
మూడవ బహుమతి: రూ. 2,000

ఇవిగాక మరో 50 కార్టూన్లు సాధారణ ప్రచురణకు ఎన్నుకుంటాము. ఎంపికైన ప్రతి కార్టూన్‌కు రూ. 200 పారితోషికం ఉంటుంది.

**జోకులు:**

ప్రథమ బహుమతి: రూ. 3,000
రెండవ బహుమతి: రూ. 2,000
మూడవ బహుమతి: రూ. 1,000

ఇవిగాక మరో 50 జోకులు సాధారణ ప్రచురణకు ఎన్నుకుంటాము. ఎంపికైన ప్రతి జోకుకూ 100 రూపాయల పారితోషికం వుంటుంది.

**నిబంధనలు:**

1. జోకులు క్లుప్తంగా, స్పష్టంగా 5, 6 పేరాలకు మించకుండా చదవగానే హాయిగా అనిపించాలి. జోకులను అక్కడా ఇక్కడా కాపీ చేసి పంపరాదు. నిజ జీవితంలో మీకు తగిలిన చమత్కారాలను సానపెట్టండి చాలు.
2. కార్టూన్లు వెడల్పు 12 సెం.మీ, ఎత్తు 7.5 సెం.మీ, సైజుతో బొమ్మ గీసి పంపాలి. డ్రాయింగ్ పేపరు మీద ఇండియన్ ఇంకుతోనే గీయాలి. ప్రతీ కార్టూన్ వెనుక పేరు, అడ్రస్ వుండాలి.
3. ఇతర పత్రికలకు పంపి పరిశీలనలో వున్న కార్టూన్లనూ, జోకులనూ మాకు పంపకూడదు.
4. కార్టూన్లను, జోకులను (ఎన్నిక కాని పక్షంలో) తిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులు అంటించిన స్వంత చిరునామా గల కవరు జత చేయాలి.
5. పోటీ గడువు తేదీని పొడిగించడానికి గానీ, పోటీని రద్దు చేయడానికి గానీ సర్వ హక్కులూ మాకు వుంటాయి. విజేతల ఎంపికపై సంపాదకునిదే తుది నిర్ణయం.
6. ఎంపికైన కార్టూన్లను తానా (టెక్సాస్) వారు సెప్టెంబరులో తీసుకు వచ్చే సావనీర్‌లో కూడా ప్రచురించబడతాయి.
7. మీరు పంపే కవరుపై జోకుల/ కార్టూన్ల పోటీకి అని స్పష్టంగా రాయాలి.

**మీ కార్టూన్లను, జోకులను ఈ చిరునామాకు పంపండి-**

**ఎడిటర్, ఆంధ్రజ్యోతి వీక్లీ,**
**రోడ్‌నెం. 8, బంజారా హిల్స్, హైదరాబాద్- 34.**

**గమనిక:**

కార్టూన్లు/ జోకులు మన భారత దేశ సాంప్రదాయం, సాంకేతిక, యువత రంగాలను ప్రతిఫలించేవిగా వుండాలి. కార్టూన్లు/ జోకులు మాకు చేరవలసిన ఆఖరు తేదీ:

**జూలై 15, 2000**